నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 13 నవంబర్ 2024 | NIZAMABAD

'ఖాకీ'లపై అవినీతి మరక

- అక్రమార్కులతో చెట్టాపట్టాల్...
- వాగులు, వంకలే టార్గెట్‌గా దోపిడీ...
- ఇసుక రవాణాలో ప్రత్యక్ష సంబంధాలు...
- ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్సైలకు పాత్ర...
- నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో లీలలు ఇవీ...
- చర్యలకు డీపీజీ ఆదేశాలిచ్చినా ఫలితం మాత్రం శూన్యం...

నిజామాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో పోలీసులే దొంగలతో చేతులు కలిపిన వైనం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో వెలుగు చూసింది. అక్రమార్కులతో అంటకాగి ట్రాక్టర్లు, టిప్పర్లకు బేరాలు మాట్లాడుకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇలా రోజులు, గంటలను లెక్కపెట్టుకుంటూ ట్రిప్పుకు ఒక రేటు చొప్పున దోపిడీ పర్వాన్ని కొనసాగించారు. ఇష్టానుసారంగా ఇసుక దోపిడీకి పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన పోలీసులు, అధికారుల తీరుతో నిజామాబాద్ కమిషనరేట్ పరువు మరోసారి బజారున పడింది. మొన్నటి మొన్న టాస్క్‌ఫోర్స్ విభాగం తీరుతో పరువు మంట కలిసిన దరిమిలా ప్రస్తుతం అవినీతి పోలీస్ అధికారుల చిట్టాతో మరోసారి ఖాకీలకు మరకలు అంటుకున్నాయి. స్వయంగా డీజీపీ కార్యాలయం నుంచి 12 మంది పోలీస్ అధికారులపై వేటు వేయాలని ఆదేశాలు వచ్చినప్పటికీ ఇంతవరకూ వారి జోలికి వెళ్లకుండా కమిషనరేట్ అధికారులు చోద్యం చూస్తుండడం విడ్డూరంగా మారింది. ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్సై స్థాయి అధికారుల లీలలపై స్వయంగా డీజీపీకి చిట్టా వివరాలు వెళ్లగా.. సీరియస్‌గా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు ఇచ్చారు. మల్టీ జోన్-2లో ఇప్పటి ఇసుక అక్రమార్కులతో చేతులు కలిపిన ఖాకీలను సస్పెన్షన్ వేటు వేయగా.. మల్టీ జోన్ -1లోని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని మకిలీ పోలీసులపై మాత్రం చర్యలు శూన్యమయ్యాయి.

డీజీపీ ఆదేశాలు బేఖాతరు...

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో డీజీపీ ఆదేశాల అమలుకే దిక్కూ మొక్కూ లేకుండా పోయింది. స్వయంగా డీజీపీ జారీ చేసిన మెమోరాండాన్ని ఆధారంగా చేసుకుని ఖాకీ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా చర్యలు మాత్రం శూన్యమయ్యాయి. ఇదేంటని అడిగేవారు లేకపోవడంతో ఉన్నతాధికారుల తీరుపై సర్వత్రా చర్చ నడుస్తున్నది. నెల క్రితం వరకు పోలీస్ కమిషనర్‌గా కల్మేశ్వర్ సింగెనవార్ పనిచేశారు. ఈ ఉత్తర్వులు ఆయన ఉన్నప్పుడు జారీ అయినట్లుగా పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. ఆకస్మికంగా ఆయన బదిలీ కావడంతో కామారెడ్డి ఎస్పీ సింధూశర్మకు నిజామాబాద్ సీపీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అక్రమార్కులపై శాఖాపరమైన విచారణ చేయాలని డీజీపీ ఆదేశాలు ఇవ్వడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. సీఐలు, ఎస్సైలపై చర్యలకు ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ కాగా అమలుకావడంలో జరుగుతున్న జాప్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు ఒక నీతి, సామాన్యులకు ఒక నీతి ఉంటుందా? అన్న ప్రశ్న ప్రజల్లో కలుగుతున్నది. పోలీస్ బాస్‌లు కీలకమైన చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తుండడం ఏమిటంటూ సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది పోలీసులు ఆయా ఠాణాల నుంచి బదిలీలు జరిగి వేరే ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. కానీ వారిపై వసూళ్లకు సంబంధించిన కేసుల్లో మాత్రం ఎలాంటి వేటు పడక పోవడం శోచనీయంగా మారింది.

సహజ వనరుల దోపిడీని అరికట్టడంలో మైనింగ్, రెవెన్యూ అధికారులతోపాటు పోలీసులకు సైతం బాధ్యత ఉంటుంది. కానీ పోలీసులు మాత్రం రోడ్లు ఎక్కి ఇసుక వాహనాలను పట్టుకుని, బేరం ఆడుకుని జేబులు నింపుకొనేందుకే ఎగబడుతున్నారు. ఇందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని 12 మంది పోలీస్ అధికారుల అవినీతి బాగోతం నిదర్శనంగా నిలుస్తున్నది. వీరి వసూళ్ల పర్వంపై డీజీపీకి ఫిర్యాదులు అందగా రహస్యంగా విచారణ చేయించారు. నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు అవినీతి పరుల జాబితాను రూపొందించి చర్యలకు ఆదేశాలు జారీచేశారు. అందులో ఒక్కొక్కరి బాగోతాలను పరిశీలిస్తే ముక్కున వేలేసుకోవడం ఖాయం. ప్రస్తుతం బదిలీలపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన సదరు పోలీసుల అవినీతి చిట్టా గమనిస్తే నెల వారీగా ఇసుక వాహనాల నుంచి ఎస్సైలు, సీఐలు వసూళ్లు చేస్తున్న తీరును చూసి ఆశ్చర్య పోవాల్సిందే. జక్రాన్‌పల్లి ఎస్సై ట్రాక్టర్‌కు రూ.20 వేలు, ఇందల్వాయి ఎస్సై ట్రాక్టర్‌కు రూ.10 వేలు, ధర్పల్లి ఎస్సై ట్రాక్టర్‌కు రూ.15 వేలు, సిరికొండ ఎస్సై ట్రాక్టర్‌కు రూ.10 వేలు, కోటగిరి ఎస్సై ట్రాక్టర్‌కు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు, వర్ని ఎస్సై ట్రాక్టర్‌కు రూ.20 వేలు (వారం క్రితం రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు), బోధన్ రూరల్ ఎస్సై ఏకంగా లింగ్డాపూర్ శివారు నుంచి రూ.6 లక్షలు, హంగర్గా శివారు నుంచి రూ.8 లక్షల చొప్పున వసూళ్లు, బోధన్ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు నెలకు రూ.2 లక్షలు, ఇతర వాహనాలకు రూ.50 వేలు, రెంజల్ ఎస్సైకి వాహనానికి రూ.10 వేలు, భీంగల్ ఎస్సైకి రూ.70 వేలు, మాక్లూర్ ఎస్సై రూ.10 వేల చొప్పున వసూళ్లు చేశారు.

'గ్రూప్-3' పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

- కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- ఈనెల 17, 18న పరీక్షలు

కామారెడ్డి, నవంబర్ 12 : జిల్లాలో ఈ నెల 17, 18వ తేదీల్లో గ్రూప్ -3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో గ్రూప్- 3 పరీక్ష నిర్వహణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో 20 కేంద్రాల్లో 8,268 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాలను పోలీసు అధికారులు ముందస్తుగా స్క్రీనింగ్ చేయాలని చెప్పారు. కేంద్రానికి ప్రహరీ లేకపోతే అదనంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటుతోపాటు బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, రీజనల్ కో -ఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో చందర్, డీఈవో రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోండి..

- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, నవంబర్ 12: -గ్రూప్-3 అభ్యర్థులకు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనులు కొనసాగుతున్న దృష్ట్యా ఈనెల 10 నుంచి డిసెంబర్ 10 వరకు నిజామాబాద్-ఆర్మూర్ మార్గంలో వాహనాల రాకపోకలను దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రూప్-3 అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిర్ణీత సమయాని కన్నా ముందే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆర్మూర్‌వైపు వెళ్లాల్సినవారు, ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వైపు వచ్చే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల్లో కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు?

భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- అధికారంలోకి వచ్చి పదకొండు నెలలైనా అమలుకాని హామీలు
- రేవంత్ ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ఫైర్
- గ్యారెంటీలు అమలుచేసే వరకు వెంటపడతాం..
- భీమ్‌గల్‌లో 224 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేత

భీమ్‌గల్, నవంబర్ 12: కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి.. రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డ కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఆ పథకాన్ని ఇప్పటికీ ఈ ప్రభుత్వం కొనసాగించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేముల హాజరయ్యారు. 224 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ మొదటగా రూ.50వేల నగదుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అందించాలనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. తర్వాత అన్ని వర్గాలకూ రూ.లక్షా నూటపదహారు అందించారని చెప్పారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదకొండు నెలలు దాటిందన్నారు. ఇప్పటివరకు తులం బంగారం ఊసే లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు పంపిణీ చేసిన లబ్ధిదారులందరికీ కూడా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతు పథకాలకు కొర్రీలు

ఎన్నికల్లో రైతులకు రూ.రెండు లక్షల రుణ మాఫీ, రూ. ఐదువందల బోనస్, రైతు భరోసా అమలుచేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి..ఇప్పుడు లేని పోని కొర్రీలు పెడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ నాయకులు ఏ మొహం పెట్టుకొని నినాదాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం హోదాలో ఉండి దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాల తయారీ, హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రమంటూ అడ్డగోలుగా మాట్లాడే రేవంత్ తీరు లాగే.. ఇక్కడి స్థానిక కాంగ్రెస్ నాయకుల తీరుకూడా అలాగే ఉందంటూ ఎద్దేవా చేశారు. ఒకవేళ ఇప్పుడు ఎన్నికలు వస్తే ప్రజలు కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెడుతారని అన్నారు.

ఫొటోల కోసం కాంగ్రెస్ నాయకుల నిర్వాకం

- వేముల పంపిణీ చేసిన చెక్కులనే మళ్లీ పంపిణీ

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అధికారికంగా, ప్రొటోకాల్ ప్రకారం వేముల పంపిణీ చేశారు. అయితే లబ్ధిదారుల నుంచి అవే చెక్కులను స్థానిక నాయకులు తిరిగి తీసుకొని మళ్లీ వారికి పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు అవాక్కై, వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అంతేలా ఫొటోలు దిగాలని ఉంటే ముందుగా తులం బంగారం ఇప్పించేలా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు నిలదీయాలని సూచించారు.

మీ పిట్ట అరుపులకు భయపడేది లేదు..

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన అనంతరం వేముల పాత్రికేయులతో మాట్లాడుతుండగా..స్థానిక కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేస్తూ అడ్డుపడ్డారు. 'మీ పిట్ట అరుపులకు ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరని, మీరు ఇక్కడ అరిచే అరుపులు సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర అరవాలని అప్పుడు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడానికి పనికివస్తాయని,' వేముల వారికి హితవు పలికారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసే వరకూ బీఆర్ఎస్ తరపున వెంటపడుతామని వేముల స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షబ్బీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, వైస్ చైర్మన్ భగత్, కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, భీమ్‌గల్ విండో చైర్మన్ నర్సయ్య, కౌన్సిలర్లు నర్సయ్య, సతీశ్, లింగయ్య,కో-ఆప్షన్ మెంబర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని అక్రమ రవాణా

బిచ్కుంద, ఇందూరులో పీడీఎస్ బియ్యం పట్టివేత

ఫత్లాపూర్-కందర్‌పల్లి మధ్య పీడీఎస్ బియ్యం తరలిస్తున్న లారీ డ్రైవర్‌ను పట్టుకొని, వివరాలను సేకరిస్తున్న సీఐ నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద/ వినాయక్‌నగర్, నవంబర్ 12: ఉమ్మడి జిల్లాలో పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నది. నిత్యం ఏదోఒక చోట అక్రమంగా తరలిస్తున్న వాహనాలు పట్టుబడుతున్నాయి. బిచ్కుందతోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కడియాతార్ కమలేశ్‌భాయ్ అనే వ్యక్తి తన లారీలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు బిచ్కుంద మండలంలోని పత్లాపూర్, కందర్ పల్లి గ్రామాల మధ్య ఉన్న 161 నంబర్ జాతీయరహదారిపై మంగళవారం ఎస్సై మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. లారీలో 35 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మినీ ఆటో రిక్షాలో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

రోడెక్కిన విద్యార్థులు

- సమయానికి బస్సులు నడపాలంటూ ఆందోళన
- సర్వీసుల కోసం పడిగాపులు.. పట్టించుకోని అధికారులు

డిగ్రీ కళాశాల ఎదురుగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

లింగంపేట/ ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు నిర్ణీత సమయానికి చేరుకునేలా బస్సు సర్వీసులను నడపాలని కోరుతూ విద్యార్థులు రోడ్డెక్కారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని బాలాజీనగర్ తండా వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు సమయానికి బస్సులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే లింగంపేట మండలం కేంద్రంలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులతోపాటు ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. మంగళవారం ఉదయం లింగంపేట నుంచి ఉదయం 6 గంటలకు బస్సు కామారెడ్డికి వెళ్లిన అనంతరం 9 గంటల వరకు మరోబస్సు బస్సు సౌకర్యం లేకుండా పోయింది. దీంతో కళాశాలకు వెళ్లడానికి వచ్చిన విద్యార్థులు బస్సుల కోసం పడిగాపులు కాశారు. ఎల్లారెడ్డి నుంచి లింగంపేట మీదుగా కామారెడ్డికి వెళ్తున్న బస్సులు నిండుగా రావడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. వారం రోజుల నుంచి బస్సులు ఆపడంలేదంటూ ఆగ్రహించిన విద్యార్థులు మంగళవారం గాంధీనగర్‌లో రాస్తారోకో నిర్వహించగా.. ఎల్లారెడ్డిమండల పరిధిలోని బాలాజీనగర్ తండా వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బస్సులు సమాయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యమస్ఫూర్తి నింపిన 'మోతె'

మోతెలో క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

క్రీడోత్సవాలను ప్రారంభించిన వేముల

వేల్పూర్, నవంబర్ 12 : మండలంలోని మోతె గ్రామం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమస్ఫూర్తికి మారుపేరుగా నిలిచిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మోతెలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడోత్సవాలను వేముల ప్రారంభించి మాట్లాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి మోతె గ్రామం ఊపిరి నిచ్చిందని తెలిపారు. ఆనాడు ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తిని పొందేందుకు మోతె మట్టిని ముడుపు కట్టి తెలంగాణ భవన్ తీసుకెళ్లారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం హోదాలో మోతె వచ్చి ముడుపు విప్పారని తెలిపారు. గెలుపోటములు సహజమని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో, స్కూల్ ప్రిన్సిపాల్, పీఆర్టీయూ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ తప్పిదానికి ఎవరు బాధ్యులు?

- అధికారుల నిర్లక్ష్యం.. డీఎస్సీ అభ్యర్థులకు శాపం
- పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చినట్టే ఇచ్చారు.. నైరాశ్యంలోకి నెట్టారు
- సాంకేతిక లోపమంటూ ఫోన్లు
- ఆందోళనలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ఖలీల్‌వాడి, నవంబర్ 12: వారు రాత్రింబవళ్లు కష్టపడి డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. అనుకున్న లక్ష్యం నెరవేరినందుకు ఎంతో సంతోషించారు. వారి కుటుంబాల్లో చెప్పరాని సంతోషం నెలకొన్నది. కొందరు కౌన్సెలింగ్‌లో డీఈవో చేతుల మీదుగా జాయినింగ్ ఆర్డర్ అందుకోగా.. మరికొందరు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కొందరు కొత్తగా పాఠశాలలో అడుగుపెట్టి విద్యార్థులకు చదువు చెప్పగా..మరికొందరు జాయినింగ్ కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో విద్యాశాఖ అధికారులు పిడుగులాంటి వార్త చెప్పి.. వారిని నైరాశ్యంలోకి నెట్టేశారు. సాంకేతిక కారణాలతో పొరపాటున మీకు జాయినింగ్ ఆర్డర్ ఇచ్చామంటూ చెప్పి.. వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. జిల్లాలో డీఎస్సీ ఫలితాలు వెల్లడిన నాటి నుంచి గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఫలితాలపై వందల కొద్ది అభ్యంతరాలు రాగా.. వాటిని విద్యాశాఖాధికారులు పరిగణనలోకి తీసుకున్నట్లు ఎక్కడా కనిపించలేదు. సాంకేతిక లోపంతో పొరపాట్లు బహిర్గతమవుతుండడంతో ఉద్యోగాలకు ఎంపికైన వారికి చావు కబురు చల్లగా చెప్పి చేతులు దులుపుకొంటున్నారు.

నైరాశ్యంలో బాధితులు..

- మాక్లూర్ మండల అమ్రాద్ గ్రామానికి చెందిన లావణ్యకు డీఎస్సీలో 257 (ఎస్‌జీటీ) ర్యాంకు వచ్చింది. ఆమెకు ధర్పల్లి మండలం దుబ్బాక పరిధిలోని వడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు. సాంకేతిక లోపంతో ఆమెకు ఉద్యోగం వచ్చినట్లు విద్యాశాఖాధికారులు రెండు రోజుల క్రితం చెప్పినట్లు సమాచారం.
- జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతానికి చెందిన నవతకు డీఎస్సీలో 203 (ఎస్‌జీటీ) ర్యాంకు వచ్చింది. ఈమె హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నది. ఈ నెల 11న నీకు జాబ్ రాలేదని చెప్పినట్లు తెలిసింది.

ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు.. ఇంకా ఎంతమంది ఉన్నారో తెలియడంలేదు. ఉద్యోగాల ఎంపిక జాబితాపై ఇప్పటికే అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతునే ఉన్నాయి. గత డీఈవో దుర్గా ప్రసాద్ హయాంలోనే ఇలాంటి తప్పిదాలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అసలు ఏం జరుగుందంటూ అభ్యర్థులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం..కొన్ని జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నది. సాంకేతిక లోపాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని కొత్త డీఈవో

కొత్తగా డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్ పాఠశాలలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నా.. మిగతా విషయాలపై దృష్టిసారించడం లేదు. డీఎస్సీ ఫలితాల్లో చోటుచేసుకున్న సాంకేతిక తప్పిదాలపై ఫోన్‌ద్వారా ఆయనను సంప్రదించడానికి ప్రయత్నించగా.. ఆయన స్పందన కరువైందని వాపోతున్నారు.